# 9. అన్నీ మంచి శకునాలే

**నేపథ్యం:**
- ఎక్కడికైనా ఉత్సాహంగా బయలుదేరి వెళుతుంటే శాస్త్రీయమైన కారణం లేకుండా మూఢనమ్మకాలతో అడ్డుకోవడం మీరెప్పుడైనా చూశారా?
- అప్పుడు మీకేమనిపిస్తుంది. మీ కుటుంబ సభ్యులు ఎలా స్పందిస్తారు? చర్చించండి.

ఇప్పుడు అటువంటి సందర్భంలో కవి హాస్యంగా ఎలా చురకవేశాడో చూద్దామా.



శకునాల నమ్మకము శరభరాజుకి మెండు
శకున మారయకుండ జుట్టైన దువ్వండు
పిల్లి పరుగిడుచున్న, కుక్కమూలుగు విన్న
తెలియరాని భయమ్ము చెలగి గుండెలదాకు. (1)

అతడొకనాడు గ్రామాంతరము పొదలచి
తిథివార నక్షత్ర యమ గండములు కొలిచి
తన కెదరు రమ్మనుచు తరుణి మణిని పిలిచి
ఇలువెడలె ముక్కోటి ఇలవేలుపుల గొలిచి. (2)

ఆయూరి పొలిమేర కవల చింతల ప్రక్క
ఎడమవైపున నుండి కుడివైపుకొక నక్క
అతడు నడిచేదారి కడ్డు పరుగెత్తింది
ముళ్ళ డొంకల దూరి మాయమై పోయింది. (3)



అది యెట్టి శకునమో అతడెరుగక పోయె
జరుగునా? పనియన్న సంశయము
మొదలాయె అడుగు సాగక వాని కాలోచనలు
పుట్టె దీని ఫలమరయుంగ తిరుగు దారి బట్టె. (4)



తమ యూరి కరణమ్ము దారిలో కనిపింప
శకున ఫలమడిగేడు సంగతులు వివరించి
"ఎడమవైపున నక్క ఎగిరితే మంచిదా?
లేక కుడివైపుగా దూకితే మంచిదా?" (5)

శరభయ్య వెర్రికా కరణ మించుక నవ్వి
వివరించె నీ రీతి విజ్ఞాన నిధి తవ్వి
"ఎటు నుండి ఎటువైపు కెగిరి దూకిన మేలు
పిక్క పట్టుక నక్క పీక కుండిన చాలు!" (6)

## I. వినండి-సంభాషించండి.

"మూఢనమ్మకాలు పాటించరాదు"- చర్చించండి.

## II. కొత్త పదాలు తెలుసుకుందాం.

### అ. అర్థాలు:-

శకునము = శుభ అశుభ సూచకము;

అరయకుండ = చూడకుండ;

చెలగి = విజృంభించి;

గ్రామాంతరం = వేరే గ్రామం;

తరుణీమణి = స్త్రీ;

పొలిమేరు = రెండు గ్రామాల మధ్య సీమరేఖ;

సంశయము = సందేహం;

మొదలాయె = ప్రారంభమయ్యెను;

అరయంగ = తెలిసికొనుటకు.

### ఆ. భావాలు:-

1. శరభరాజు శకునం చూడకుండ తల కూడా దువ్వడు. ప్రయాణమగునపుడు పిల్లి పరుగెత్తినా, కుక్కమూలుగు విన్నా అతనికి మనసులో విపరీతమైన భయం కలుగుతుంది.
2. అతడు ఒకనాడు వేరే గ్రామం వెళ్ళాలని అనుకొన్నాడు. తిథి, వార, నక్షత్ర యమగండాలను చూచాడు. బయలుదేర బోవుచు భార్యను ఎదురుగా రమ్మని పిలిచాడు. ముక్కోటి దేవతలను ప్రార్థించి ఇంటినుండి బయలు దేరాడు.
3. ఆ ఊరి పొలిమేర దాటగానే చింత చెట్ల ప్రక్క నుండి ఒక నక్క వచ్చి ఎడమవైపు నుండి కుడివైపునకు పరుగెత్తుకు వెళ్ళెను. తరువాత అది ముళ్ళ డొంకలలో దూరి కనుపించకుండా పోయెను.
4. శరభరాజుకు అది ఎటువంటి శకునమో తెలియలేదు. అతనికి తాను వెళుతున్న పని జరుగుతుందా అను అనుమానం ప్రారంభమయ్యెను. అతనికి ఒక్క అడుగు కూడా ముందుకు సాగలేదు. అతని మనస్సులో అనేక ఆలోచనలు ప్రారంభమయ్యాయి. ఆ శకున ఫలం తెలిసికొనుటకై తిరుగుదారి పట్టి గ్రామంలోకి వచ్చాడు.
5. శరభరాజుకు దారిలో తమ ఊరి కరణం కనిపించాడు. సంగతులన్నియు అతనికి వివరించాడు. తరువాత నక్క ఎడమవైపు నుండి కుడివైపునకు వెళితే మంచిదా? కుడివైపు నుండి ఎడమవైపుకు వెళితే మంచిదా? అని శకున ఫలం అడిగాడు.
6. శరభయ్య మూఢనమ్మకానికి ఆ కరణం నవ్వి తన శాస్త్ర పరిజ్ఞానంతో ఈ విధంగా వివరించాడు. నక్కెటునుండి ఎటు దూకినను మంచిదే. నీ పిక్క పట్టుకొని పీక కుండిన చాలు అని పలికాడు.

## III. వినండి-ఆలోచించండి-రాయండి.

### అ. ఒక్కొక్క వాక్యంలో సమాధానాలు రాయండి.

1. శరభరాజుకు వేటిపై నమ్మకమెక్కువ?
2. తనకెదురు రమ్మని శరభరాజు ఎవరికి చెప్పెను?
3. శరభరాజున కెదురైన శకునమేమి?
4. కరణంను శరభరాజు ఏమని అడిగెను?
5. ఈ పాఠం నుండి నీవు నేర్చుకొన్న నీతి ఏమి?

### ఆ. మూడు, నాలుగు వాక్యాలలో సమాధానాలు రాయండి.

1. గ్రామంతరం వెళ్ళదలచిన శరభరాజు ఏమి చేసెను?
2. నక్క ఎదురైనపుడు శరభరాజు ఏమి చేసెను?
3. కరణం, శరభయ్య వెర్రిని పోగొట్టిన విధమెట్టిది?

### ఇ. పాఠంలోని 1వ, 2వ పద్యాలు చదివి అడిగిన విధంగా కృత్యాలు చేయండి.

**ఈ. కుండలీకరణంలో ఇచ్చిన పదాలతో ఖాళీలను పూరించండి.**

(డొంకల, నమ్మకము, భయము, పీక కుండిన గ్రామాంతరము)

1. అతడొకనాడు ________ పోదలచి.
2. తెలియరాని ________ చెలగి గుండెలదాకు.
3. ముళ్ళ ______ దూరి మాయమై పోయింది.
4. పిక్క పట్టుక నక్క ________ చాలు.

**ఉ. వాచకాలు గుర్తించి రాయండి.**

1. శరభరాజు 2. తరుణిమణి

**ఊ. ప్రాసపదాలను ఏరి రాయండి.**

| | | | |
|---|---|---|---|
| పోదలచి | | | |
| ప్రక్క | , | నవ్వి | |
| చాలు | , | మెండు | |

**IV. భాషావగాహన**

**అ. తగిన విరామ చిహ్నాలతో రాయండి.**

1. పిల్లి పరుగిడుచున్న కుక్క మూలుగు విన్న
2. ముళ్ళ డొంకల దూరి మాయమైపోయింది
3. కుడివైపుగా దూకితే మంచిదా
4. పిక్కపట్టుక నక్క పీక కుండిన చాలు

**ఆ. వ్యతిరేక పదాలు రాయండి.**

1. నమ్మకము x ______
2. రమ్ము x ______
3. ఎడమ x ______
4. మేలు x ______

**ఇ. సర్వనామాలను, క్రియలను గుర్తించండి. పట్టికలో రాయండి.**

| | సర్వనామం | క్రియ |
|---|---|---|
| 1. అతడొకనాడు గ్రామాంతరం పోదలచెను. | | |
| 2. భార్యను తనకు ఎదురు రమ్మనెను. | | |
| 3. అతడు నడిచే దారికడ్డ పరుగెత్తింది. | | |
| 4. అది ఎట్టి శకునమో అతడు ఎరుగకపోయె. | | |
| 5. దీని ఫలమరయంగ తిరుగుదారి బట్టి. | | |

**V. స్వీయస్పందన**

మీరు చదివిన 'శకునఫలం' పాఠం గురించి తెలియచేస్తూ సైన్యంలో పనిచేస్తున్న మీ మామయ్యకు కింది అంశాల ఆధారంగా లేఖ రాయండి.

1. నీ చిరునామ
2. సంబోధన
3. క్షేమ సమాచారాలు
4. లేఖలో అడిగిన విషయం
5. శకునం అంటే ఏమిటి?
6. శరభయ్య ప్రయాణం ఏవిధంగా సాగింది?
7. దారిలో కనబడ్డ కరణాన్ని ఏమడిగాడు?
8. కరణం ఏమని సమాధానమిచ్చాడు?
9. ఆఖరి పేరా
10. ముగింపు
11. మామయ్య చిరునామ

**VI. కింది సందర్భాలలో 'శకునాన్ని' పాటిస్తే ఏమవుతుంది?**

- ఒక డాక్టరు అత్యవసర ఆపరేషన్ చేయాలి. శకునాలు పాటిస్తూ కూర్చుంటే .....................?
- విద్యార్థి సమయానికి పరీక్షా కేంద్రం చేరుకోవాలి శకునాన్ని పాటిస్తూ సమయం దాటిపోతే ...........?
- అగ్నిమాపకదళం, సైనికులు, పోలీసులు, శకునాలు పాటిస్తూ జాప్యం చేస్తే ప్రజల గతి ఏమవుతుంది?